క్లుప్తంగా

శిలాఫలకం ఆవిష్కరణ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు శ్రీకాంత్‌నగర్‌లోని డబుల్ రోడ్డులో కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల శిలాఫలకం ఏర్పాటు చేశారు. దీన్ని ఆదివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న దీపికా, నందిని

మద్దిలపాలెం: త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాల సందర్భంగా త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన గాత్ర కచేరి శ్రావ్యనందకరంగా సాగింది. గాత్ర విద్వాంసుడు నైవేలి సంతాన గోపాలన్ శిష్యులు దీపికా కుమారి, నందిక సోదరీమణులు త్యాగరాజ కృతులు ఆలపించి అలరించారు. కార్యక్రమాన్ని విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, రామగోపాల్ రామకృష్ణరాజు, ఇందిరలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.


గురుకుల ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణ



శిక్షణకు హాజరైన గురుకుల ఉపాధ్యాయులు

సీతంపేట: ఆంగ్ల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంపొందించే దిశగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం శంకరమఠం రోడ్డులోని ఒక హోటల్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా సొసైటీ డీసీవో డాక్టర్ సి.ప్రభావతమ్మ మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయుల్లో ఇంగ్లిష్ బోధనా సామర్థ్యం మెరుగుపర్చడానికి ముంబైకి చెందిన కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకున్నట్టు తెలిపారు. కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఫ్యూచర్ రెడీనెస్ అంశంపై మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గురుకుల ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, కోటక్ ఫౌండేషన్ ప్రతినిధులు నూథన్, ఫర్జిత్ పంతక్, జ్యోతి శిక్షణ ఇచ్చారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ నామ సంకీర్తనలతో సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు ప్రత్యేక పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీతలోని శ్లోకాలను, అనేక ఆధ్యాత్మిక ప్రవచనాలను భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ రంగుల పుష్పాలతో ప్రత్యేకంగా, నయనందకరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కీర్తనలు ఆలపించారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

కొమ్మాది: తీర ప్రాంత మత్స్యకారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మెరైన్ ఎస్ఐ మురళీకృష్ణ సూచించారు. ఆదివారం ఆయన కొమ్మాది సమీపంలోని తీర ప్రాంతాలైన ఉప్పాడ, కాపులదిబ్బడపాలెం, మంగమారిపేట గ్రామాల్లో మత్స్యకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెరైన్ ఎస్ఐ మాట్లాడుతూ, ప్రస్తుతం వేట నిషేధ సమయం అమల్లో ఉన్నందున ఎవరూ వేటకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా, దక్షిణ కాశ్మీర్ లో ఉగ్రవాద కార్యకలాపాల వల్ల ఎదురయ్యే భద్రతాపరమైన బెదిరింపుల గురించి మత్స్య కారులకు వివరించారు. తీర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే తమకు తెలియజేయాలని ఆయన కోరారు. అప్రమత్తంగా ఉండటం ద్వారా అవాంఛనీయ ఘటనలను నివారించవచ్చన్నారు.

నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(ఎన్‌ఏబీహెచ్) హోదా పొందిన మొట్టమొదటి ప్రభుత్వ ఆస్పత్రిగా పెదవాల్తేరులోని చెస్ట్ అండ్ సీడీ హాస్పిటల్ రికార్డు నమోదు చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అనేక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసింది. ఏ ప్రభుత్వ ఆస్పత్రికి సాధ్యం కాని ఎన్‌ఏబీహెచ్ హోదాను పెదవాల్తేరు చాతి ఆస్పత్రికి వచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉన్నతాధికారుల **పర్యవేక్షణ లోపం వల్ల** ఆ హోదా కోల్పోయే పరిస్థితికి చెస్ట్ హాస్పి**టల్ చేరింది. ఆస్పత్రి** నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికొది**లేయడంతో ఎన్‌ఏ**బీహెచ్ హోదా కొనసాగేనా అనే సందేహం **నెలకొంది.**

- బీచ్ రోడ్డు



పెదవాల్తేరులోని ప్రభుత్వ చెస్ట్ అండ్ సీడీ హాస్పిటల్

ఉత్తమ ఆస్పత్రి హోదా.. కొనసాగేనా..!

ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి నిర్వహణను గాలికొదిలేసిన ఉన్నతాధికారులు

- **వార్డుల్లో ప్రమాదకర సీలింగ్స్ కిందే రోగులకు వైద్యం**
- **ఆస్పత్రి పరిసరాల్లోనే బయో మెడికల్ వ్యర్థాల డంపింగ్**
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు, ఆవరణ
- ఎన్‌ఏబీహెచ్ హోదాను కోల్పేయే పరిస్థితి



ఆస్పత్రి ఆవరణలో మద్యం సీసాలు

అత్యవసర విభాగం ఎదురుగా చెత్తాచెదారం



పనిచేయని మూత్ర విసర్జన బేసిన్

క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నడిచే ఎన్‌ఏబీహెచ్ హోదాను ఆస్పత్రిలో రోగికి అందించే నాణ్యమైన వైద్యం.. ఆస్పత్రి పరిసరాల్లో పాటించాల్సిన పరిశుభ్రత ఆధారంగా కల్పిస్తారు. బయో మెడికల్ వేస్ట్ వేరు చేసే పద్ధతి.. రోగులకు సేఫ్టీతో కూడిన వైద్యం అందించడం.. ఇలా అనేక రకాల పారామీటర్లను పరిగణలోకి తీసుకొని ఈ హోదాను ఆస్పత్రులకు కల్పిస్తారు. దీనిని పొందడం అంటే అంతర్జాతీయ స్థాయిలో ఆస్పత్రికి గుర్తింపు లభించినట్టే. అటువంటి గుర్తింపు ఛాతి ఆస్పత్రికి వచ్చేందుకు గత ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ఇప్పుడు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల బయో మెడికల్ వ్యర్థాలను చాతి ఆస్పత్రి ఆవరణలోనే పడేయడం, మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, ఆస్పత్రిలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం దర్శనమివ్వడంతో ఎన్‌ఏబీహెచ్ హోదాను కోల్పోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆస్పత్రి ఆవరణలో మద్యం సీసాలు

సాధారణంగా ఆస్పత్రుల్లో మందుల సీసాలు దర్శనమిస్తాయి.. ఛాతి ఆస్పత్రిలో మాత్రం మందుల సీసాలతోపాటు మత్తెక్కించే మద్యం సీసాలు కూడా దర్శనమిస్తున్నాయి. ఈ ఆస్పతి పరిసరాల్లో అది కూడా ప్రధాన విభాగం ఎదురుగా ఉన్న ఆవరణలోనే మద్యం సీసాలు కనిపించడం ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

తీరు మారకుంటే హోదా గోవిందా..

మరో మూడు నెలల్లో ఎన్‌ఏబీహెచ్ సభ్యులు ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిని సందర్శించి హోదాను సమీక్షించనున్నారు. ఈ లోగా ఉన్నతాధికారుల తీరు మారకపోతే ఈ హోదా కొనసాగడం కష్టమేనని పలువురు చెబుతున్నారు. రోగుల భద్రత, ఆస్పత్రి పరిశుభ్రత, బయో మెడికల్ వేస్టేజీ తరలింపుపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఎంతో శ్రమించి సాధించిన ఎన్‌ఏబీహెచ్ హోదా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'భయో' మెడికల్ వ్యర్థాలు



చెస్ట్ ఆస్పత్రి ఆవరణలో పడేసిన బయో మెడికల్ వ్యర్థాలు

ఎన్‌ఏబీహెచ్ హోదాలో బయో మెడికల్ వేస్ట్‌ను వేరు చేయడం, తరలించడం అత్యంత కీలకమైంది. చెస్ట్ ఆస్పత్రి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల దిగువ సిబ్బంది ఈ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడే విసిరేస్తున్నారు. ముఖ్యంగా ఆస్పత్రి వెనుక వైపు పెద్ద మొత్తంలో మందులు, ఇంజక్షన్లు, ఇతర మెడికల్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. బయో మెడికల్ వ్యర్థాలను ఇలా బహిరంగ ప్రదేశంలో పడేయడం ఎంతో ప్రమాదకరం.

వార్డుల్లో ప్రమాదకరంగా సీలింగ్

ఛాతి ఆస్పత్రిలోని రోగులు ఉండే వార్డుల్లో సీలింగ్ రాలిపోయి ప్రమాదకరంగా కనిపిస్తోంది. వాటి కిందే రోగులకు వైద్యం అందిస్తున్నారు. రోగుల భద్రతకు అధిక ప్రాధాన్యమిచ్చే ఎన్‌ఏబీహెచ్ హోదాలో కీలకమైన ఈ అంశాన్ని ఉన్నతాధికారులు గాలికొదిలేశారు. దీంతో రోగులు బిక్కు బిక్కుమంటూ వైద్యం పొందుతున్నారు.



వార్డులో పాడైన సీలింగ్ కింద రోగులు

ప్రేమసదన్‌లో ఘనంగా మాతృశ్రీ ఈశ్వరమ్మ వర్ధంతి



సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

ఎంవీపీకాలనీ: శ్రీసత్యసాయి సేవా సమితి విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని ప్రేమసదన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, భక్తులు ఈశ్వరమ్మకు భక్తి పూర్వక శ్రద్ధాంజలి ఘటించారు. భజన మండళ్ల సమన్వయంతో 15 మంది బాలవికాస్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భిన్నత్వంలో–ఏకత్వం, శివభక్తి స్వరూపం స్వామి, పంచభూతాలు, రామాయణం నృత్యరూపకం కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, శ్రీసత్యసాయి సిటీ సేవా సమితి కన్వీనర్ డీవీవీఎస్ రాజు, భజన మండళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌కు గ్లోబల్ అవార్డు



శ్రీలంకలో ఐఈఈ అవార్డు అందుకుంటున్న స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు

మద్దిలపాలెం: స్థానిక స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు విశేష గౌరవం పొందారు. ప్రపంచ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులు, సంస్థలకు ప్రదానం చేసే ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్(ఐఈఈ) అవార్డు–2025ను అందుకున్నారు. ఈ నెల 3న శ్రీలంక దేశం కొలంబోలో నిర్వహించిన ఐఈఈ అవార్డుల ప్రదానోత్సవంలో తెలుగు సినీ నటుడు అలీ, బౌద్ధ భిక్షువు, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా మళ్ల రామునాయుడు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. 'భవిష్యత్ నాయకుల కోసం అత్యంత నవీన పాఠశాల' విభాగంలో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఎంపికైంది. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ ఈ అవార్డు మనందరి గౌరవమన్నారు. ఏపీపీయూఎస్ఎంఏ, టీఆర్ఎస్ఎంఏ, ఎన్ఐఎస్ఏలకు దేశవ్యాప్తంగా తమ పాఠశాల కాన్సెప్ట్ విస్తరించడంలో చూపిన మద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో సామాజిక భవనం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. జోడుగుళ్లపాలెంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సామాజిక భవనం పనులను పూర్తిచేయకుండా మధ్యలో నిలిపేశారు. దీన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటస్వాతి సంబంధిత అధికారులకు పలుసార్లు విన్నవించినా.. ఫలితం లేదు. ఆమె స్థానికులతో కలసి ఇటీవల జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రాలు అందించారు. ఇటీవల గ్రీవెన్స్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు కూడా భవన నిర్మాణం పూర్తి చేయించాలని విన్నవించుకున్నారు. ఇంతవరకు దీని గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యాడంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారితే ప్రజల అవసరాలను తీర్చరా అంటే ప్రశ్నిస్తున్నారు. జోడుగుళ్లపాలెంలో బీచ్ రోడ్డును ఆనుకొని సామాజిక భవనం నిర్మాణం కోసం 2022లో రూ.75 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీనిలో జీవీఎంసీ రూ.50 లక్షలు, ఎంపీ నిధులు రూ.25 లక్షలు మంజూరైనట్లు చేశారు. కొద్ది రోజుల తర్వాత దీని పనులు ప్రారంభించారు. భవన నిర్మాణం పనులు జరుగుతుండగా.. 2024లో సాధారణ ఎన్నికలు జరగడం.. కూటమి ప్రభుత్వం ఏర్పడంతో దీని నిర్మాణానికి గ్రహణం పట్టింది. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోలేదు. ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన సామాజిక భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



జోడుగుళ్లపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణం

మత్స్యకారులకు ప్రత్యేక వైద్య సేవలు

ఎంవీపీకాలనీ: జాలరి ఎండాడ, అప్పుఘర్ దరి వాసవానిపాలెం మత్స్యకార గ్రామాల ప్రజల కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాసవానిపాలెంలోని సామాజిక భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి డీఐజీ గోపినాథ్ జెట్టి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక మత్స్యకారులకు బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలతోపాటు మహిళ సంబంధిత సమస్యలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆయా గ్రామాలకు చెందిన 200 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. పలువురు పోలీసు అధికారులు సైతం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ విభాగం అడిషనల్ ఎస్పీ మధుసూదన్‌రావు, నార్త్ సబ్ డివిజన్ అధికారి బి.నాగేశ్వరరావు, పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ జి.దివాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అడిషనల్ ఎస్పీ మధుసూదన్‌రావు

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి

దాబాగార్డెన్స్: అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఈనెల 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుందన్నారు. చెన్నైలోని సామ్‌సంగ్ కంపెనీలో కార్మికులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న యూనియన్‌ను రిజిస్టర్ చేయకుండా యాజమాన్యం, ప్రభుత్వం అడ్డుకున్నాయన్నారు. లేబర్‌కోడ్ అమల్లోకి వస్తే కార్మికులు ఏ కష్టం వచ్చినా సమస్య పరిష్కారానికి సమ్మె చేయలేరని, అలా చేస్తే ఒక రోజు సమ్మెకు 8 రోజుల వేతనం కోల్పోతారన్నారు. నాయకులను జైల్లో పెట్టి నిర్బంధించవచ్చని, యూనియన్ రిజిస్ట్రేషన్, గుర్తింపు రద్దు చేయవచ్చని, లక్షలాది రూపాయల జరిమానా విధించవచ్చన్నారు. మరోవైపు ఇప్పటి వరకు కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చెల్లించని యజమానులకు జైలు శిక్ష పడేదని, దానికి భయపడి కట్టేవారన్నారు. యజమానులు జైలుకెళ్తే బెయిల్ రావాలంటే 50 శాతం చెల్లించాల్సి ఉండేదన్నారు. కానీ లేబర్ కోడ్‌లో యజమానుకు ఈ శిక్షలు ఎత్తివేశారన్నారు. కార్మికుల పాలిట శాపంగా మారే లేబర్‌కోడ్ల రద్దుకు పోరుబాట పట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమణబాబు, సురేష్, హెచ్ఎంఎస్ నాయకుడు మంగయ్య నాయుడు, సిటు గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభ రాజు, త్రినాథరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మణరావు, సీఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు కనకారావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు బి. వెంకట్రావు, సిటు కార్యదర్శి బి. జగన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

7 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

మహారాణిపేట: నేటి స్పీడ్ యుగంలో విద్యార్థులు, ఉద్యోగులు, వయోవృద్ధులు మానసిక ఒత్తిడికి లోనై అనేక రుగ్మతల పాలిట పడుతున్నారు. క్షణికావేశంలో పొరపాట్లు చేస్తున్నారు. ఒత్తిడి నివారణకు యోగా చేయాలని ప్రకృతి చికిత్సాలయం యోగ సాధకురాలు డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ నెల 7 నుంచి అందరికీ ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. బీచ్ రోడ్డులోని ప్రకృతి చికిత్సాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. వయోభేదం లేకుండా మహిళలు, పురుషులు, విద్యార్థులందరికీ నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డాక్టర్ శ్రీలక్ష్మి కోరారు. ఔత్సాహికులు గోకుల్ పార్కు ఎదురు రోడ్డు, బుద్ధవరపు గార్డెన్స్, మహారాణిపేటలో గానీ 98660 77307 నంబర్‌లో గానీ సంప్రదించాలన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత శ్రీరాములుకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి విశాలాక్షినగర్‌కు చెందిన సుంకర శ్రీరాములు దంపతులు ఆదివారం లక్ష రూపాయలు విరాళం అందజేశారు. సింహగిరిపై ఉన్న దేవస్థానం పీఆర్‌వో కార్యాలయంలో వారు ఈ విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. దేవస్థానం తరపున దాతకు ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌ను అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, శేష వస్త్రం, ప్రసాదం పంపిణీ చేశారు.

రైతుబజార్‌లో ఆటో డ్రైవర్‌పై దాడి



దాడి అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న గ్రామీణ ఆటో డ్రైవర్



డ్రైవర్‌పై దాడి చేస్తున్న కొబ్బరితోట ప్రాంతానికి చెందిన వ్యక్తులు

బీచ్‌రోడ్డు: ఆటోల నుంచి కూరగాయలు, పండ్లు దింపే క్రమంలో ఇద్దరు ఆటో డ్రైవర్ల మధ్య గొడవ జరిగి ఒకరిపై భౌతిక దాడులు చేశారు. ఇదంతా ఎస్టేట్ ఆఫీసర్ ముందే జరిగినా.. తనకేం సంబంధం లేదన్నట్లు ఈవో వ్యవహరించడంతో గొడవ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామీణ ప్రాంతం నుంచి ఒక ఆటో డ్రైవర్ కూరగాయలు తీసుకొని ఆదివారం పెదవాల్తేరు రైతుబజారుకు వచ్చాడు. అదే సమయంలో జ్ఞానాపురానికి చెందిన మరో ఆటో డ్రైవర్ బజారుకు పండ్లు తీసికొచ్చాడు. ఈ ఆటోల నుంచి సరకులు దింపేందుకు కలాసీల విషయంలో ఇద్దరు డ్రైవర్ల మధ్య గొడవ ప్రారంభమైంది. జ్ఞానాపురం ఆటో డ్రైవర్ కొబ్బరితోట ప్రాంతం నుంచి కొంత మందిని రప్పించి గ్రామీణ ప్రాంత ఆటో డ్రైవర్‌పై దాడి చేసి చితకబాదారు. శరీరంపై ఉన్న దుస్తులు మొత్తం చిరిగి, గాయాల పాలైన ఆ ఆటో డ్రైవర్ మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గ్రామీణ ఆటో డ్రైవర్‌పై దాడి చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే తమ కూరగాయలను ఎవరూ బజారుకు తీసుకొస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

చోద్యం చూసిన ఎస్టేట్ ఆఫీసర్

గ్రామీణ ప్రాంతం నుంచి కూరగాయలు తీసుకొచ్చే ఒక ఆటో డ్రైవర్‌పై కొంత మంది బయట వ్యక్తులు దాడి చేస్తుంటే.. అక్కడే ఉన్న ఎస్టేట్ ఆఫీసర్ సత్యవేణి చోద్యం చూశారు. ఇంత గొడవ జరిగినా కనీసం ఆటో డ్రైవర్ల పేర్లు కూడా ఆమె తెలుసుకోకపోవడం విధుల్లో ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో తెలుస్తోంది. పోలీసులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం, గొడవను ఆపేందుకు ప్రయత్నించని ఈవో తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మా కాలనీ రోడ్లు బాగుచేయండి

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీ ఫారం వద్ద రాజీవ్‌నగర్‌లోని వీధి రోడ్లు శిథిలమయ్యాయి. కొన్ని చోట్ల గోతులు పడగా.. మరి కొన్ని చోట్ల రాళ్లు తేలిపోయాయి. శిథిల రహదారుల్లో నడవలేక పోతున్నామంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా ఇక్కడ రోడ్లు పాడైనా.. ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదని చెబుతున్నారు. వార్డు కార్పొరేటర్ మా కాలనీని ఇంతవరకు సందర్శించలేదని, జీవీఎంసీ అధికారులకు మా కాలనీ జాడే తెలియదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మా కాలనీలో పర్యటించి రోడ్లు బాగుచేయాలని రాజీవ్‌నగర్ వాసులు కోరుతున్నారు.



రాజీవ్‌నగర్‌లో గోతుల రహదారి

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎంపాలెం: వారాంతపు వినోదంలో భాగంగా శిల్పారామంలో ఆదివారం జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. శ్రీ రాజేశ్వరీ కూచిపూడి కళామిత్ర కేంద్రంలో శిక్షణ పొందిన చిన్నారులు తమ నృత్యంతో అందరినీ ఆకట్టుకున్నారు. 'మహాగణపతిం భజే' అనే గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కళాకారులు 'బ్రహ్మమొక్కటే...', 'మూషిక వాహన...', 'రామాయణ శబ్దం...', 'అదివో అల్లదివో...', 'గోవింద గోవింద...', 'భావములోన...' వంటి అన్నమయ్య కీర్తనలకు చక్కగా నృత్యం చేశారు. శివతాండవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రదర్శనలో కె. కృతిక, వీక్షిత, బాల భార్గవి, ప్రియదర్శిని, ఉజ్వల, శ్రీజ, సిద్ధేశ్వర్, హిమస్వరూప్, సాయి కౌశిక్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ ఏవో రమణ పర్యవేక్షించారు.



అన్నమయ్య కీర్తనకు కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారి కళాకారిణులు